క్లుప్తంగా

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్


కల్లెడలో కొత్త ఫీడర్ ప్రారంభిస్తున్న డీఈ

జగిత్యాలరూరల్: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యమని ట్రాన్స్‌కో డీఈ రాజిరెడ్డి అన్నారు. శనివారం జగిత్యాల రూరల్ మండలం కల్లెడ సబ్‌స్టేషన్ పరిధిలో కొత్త ఫీడర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులతో పాటు, గ్రామాలకు నిరంతర విద్యుత్ అందించడం కోసం విద్యుత్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏడీఈ జవహర్‌లాల్‌నాయక్, ఏఈ సుందర్ నాయక్ పాల్గొన్నారు.

ఉద్యోగులు, పింఛన్‌దారులకు ఊరట

జగిత్యాలటౌన్: మెడికల్ రీయింబర్స్‌మెంట్ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరించాలన్న ప్రభుత్వ నిర్ణయంతో ఉద్యోగులు, పెన్షనర్లకు ఊరట లభించనుందని తెలంగాణ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్‌కుమార్ అన్నారు. శనివారం అసోసియేషన్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మెడికల్ రీయింబర్స్‌మెంట్ అర్జీలను ఆన్‌లైన్ చేయడంతో రోజుల వ్యవధిలోనే స్క్రూటినీ ప్రక్రియ పూర్తికానుందన్నారు. బిల్లుల స్క్రూటినీ బాధ్యతను డీఎంఈ నుంచి ఆరోగ్యశ్రీ ట్రస్టుకు అప్పగించాలని కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి బొల్లం విజయ్‌కుమార్, కోశాధికారి గౌరిశెట్టి విశ్వనాథం, సహాయ కార్యదర్శి పీసీ హన్మంతరెడ్డి, ఉపాధ్యక్షుడు వి ప్రకాష్‌రావు పాల్గొన్నారు.

పోస్టల్ పథకాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న పోస్టల్ సిబ్బంది

కోరుట్లరూరల్: మండలంలోని మాదాపూర్‌లో పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే పథకాలపై ప్రజలకు శనివారం అవగాహన కల్పించారు. సుకన్య సమృద్ధి యోజన, ఆర్‌డీ. టీడీ, ఎస్‌బీ, ఎంఐఎస్, పోస్టల్ బీమా, తదితర పథకాలను వివరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దారిశెట్టి రాజేశ్, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యం కోసం ప్రభుత్వ విప్ సహకారం

కథలాపూర్: మండలంలోని తుర్తి గ్రామానికి చెందిన తుపాకుల రవీందర్ అనే వ్యక్తికి ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం కోసం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సహకారం అందించినట్లు గ్రామస్తులు శనివారం తెలిపారు. రవీందర్ అనారోగ్యానికి గురికావడంతో కరీంనగర్‌లో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ఆసుపత్రి యాజమాన్యం చికిత్స కోసం బిల్లు రూ. 5 లక్షలు చెల్లించాలని తెలపగా, దీంతో బాధితకుటుంబం బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు యాగండ్ల రమేశ్‌ను ఆశ్రయించారు. రమేశ్‌గౌడ్ ఈ విషయాన్ని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రైవేట్ ఆస్పత్రి యాజమాన్యంతో మాట్లాడి రూ. 3.50 లక్షలు బిల్లు మాఫీ చేయించారు. కాగా, చికిత్స పొందుతూ తుపాకుల రవీందర్ శనివారం మృతి చెందినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.

చెక్కులు పంపిణీ


చెక్కు అందిస్తున్న నాయకులు

కథలాపూర్: మండలంలోని అంబారిపేట, దుంపేట గ్రామాల్లో పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను మండల కాంగ్రెస్ నాయకులు శనివారం పంపిణీ చేశారు. అంబారిపేటలో సోమయ్యకు రూ. 39 వేలు, దుంపేటలో పులి నాగేశ్‌కు రూ. 10,500 చెక్కు, కొత్తూరి లతకు రూ. 45 వేలు చెక్కును అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు, ప్రధాన కార్యదర్శి జవ్వాజి రవి, నాయకులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి తీగ చోరీ

వెల్గటూర్: మండలంలోని రాంనూర్‌లో శనివారం ఉదయం దొంగలు పడి వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగితీగ దొంగిలించినట్లు ఏఈ శ్రీనివాస్ తెలిపారు. సుమారు 50 వేల విలువైన తీగను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించినట్లు అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సర్వే వివరాలు తప్పల్లేకుండా నమోదు చేయాలి


మెట్‌పల్లి: సర్వే పత్రాలు పరిశీలిస్తున్న కమిషనర్


రేచపల్లిలో సర్వేను పరిశీలిస్తున్న జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రఘువరన్

సారంగాపూర్: సర్వే వివరాలను తప్పులు లేకుండా నమోదు చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రఘువరన్ అన్నారు. శనివారం సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో సమగ్ర కుటుంబ సర్వే తీరును పరిశీలించి ఎన్యూమరేటర్లకు, పర్యవేక్షణ చేస్తున్న అధికారులకు పలు సూచనలు చేసారు. ఆయన వెంట ప్రత్యేకాధికారి సుజాత, ఎంపీడీవో గంగాధర్, ఎంపీవో శశికుమార్‌రెడ్డి ఉన్నారు. బీర్‌పూర్ మండలంలో సర్వేను ఎంపిడివో లచ్చాలు పరిశీలించారు.

సమగ్ర సర్వే సిబ్బందికి ప్రజలు సహకరించాలి

మెట్‌పల్లి: సమగ్ర కుటుంబ సర్వే సిబ్బందికి ప్రజలు సహకరించాలని కమిషనర్ మోహన్ సూచించారు. పట్టణంలో శనివారం సర్వే ప్రారంభం కాగా, పలు వార్డుల్లో ఆయన పర్యటించి దానిని పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. సర్వే విషయంలో ఎలాంటి లోపాలు లేకుండా పకడ్బందీగా చేయాలన్నారు. ప్రజలకు కూడా సిబ్బంది అడిగే వివరాలు అందించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

కోరుట్ల రూరల్: గ్రామాల్లో ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహిస్తున్న సిబ్బందికి ఇంటి యజమానులు సహకరించాలని ఎంపీడీవో ఓదెల రామకృష్ణా అన్నారు. మండలంలోని మోహన్‌రావుపేట, వెంకటాపూర్ గ్రామాల్లో ఇంటింటి సర్వేను శనివారం పరిశీలించారు.

పెగడపల్లి: సమగ్ర ఇంటింటా కుటుంబ సర్వే పకడ్బందీగా ఉండాలని ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో మహేందర్ ఎన్యుమరేటర్లకు సూచించారు. పెగడపల్లి మండలంలో పలు గ్రామాల్లో శనివారం సమగ్ర ఇంటింటా కుటుంబ సర్వే జరుగుతున్న తీరును ఆయన వారు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. సర్వేకు వస్తున్న సిబ్బందికి ప్రజలు సహకరించి వివరాలు నమోదు చేయించుకోవాలని కోరారు.

మల్యాల: మండలంలోని గ్రామాల్లో ఇంటింటా సమగ్ర కుటుంబ సామాజిక సర్వేలో భాగంగా శుక్రవారం సర్వే ప్రారంభించారు. సర్వేను ఎంపీడీవో స్వాతి, ఎంపీవో ప్రవీణ్ సందర్శించి, సర్వే వివరాలను పరిశీలించారు.

ఇబ్రహీంపట్నం : మండలంలోని సమగ్ర కుటుంబ సర్వే పనులు శనివారం నుంచి ప్రారంభం కావడంతో ఫారాలు ఆలస్యంగా రావడంతో మండలపరిషత్ కార్యాలయంలో మండలంలోని పంచాయతి కార్యదర్శులకు ఎంపీడీవో చంద్రశేఖర్ పంపిణీ చేశారు.

ధర్మపురి: కుటుంబ సర్వేను పగడ్బందిగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఎన్యుమలేటర్లతో సమావేశం నిర్వహించారు. తప్పులు లేకుండా సర్వేను చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణ చైతన్య, అధికారులు పాల్గొన్నారు.

వెల్గటూర్: కులగణన సర్వేకు ప్రజలంతా సహకరించాలని తహసీల్దార్ శేఖర్ అన్నారు. మండలంలోని వెల్గటూర్, శాఖాపూర్ గ్రామాల్లో సర్వేను శనివారం పరిశీలించి పలు సూచనలు చేశారు.

అభివృద్ధి, సంక్షేమం కోసం నిరంతరం కృషి


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ హన్మండ్లు

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

రాయికల్: రాయికల్ పట్టణ, మండల అభివృద్ధి, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం రాయికల్ పట్టణంలో రూ.2.80 కోట్లతో సీసీరోడ్లు, డ్రెయినేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో రూ.2.90 కోట్ల పనుల బిల్లులు పెండింగ్‌లో ఉండగా సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో మంజూరయ్యాయని గుర్తుచేశారు. బల్దియాలో రూ.5.80 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని గుర్తుచేశారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, వైస్ చైర్మన్ రమాదేవి, కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, సింగిల్ విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, కౌన్సిలర్లు మహేందర్, శ్రీధర్‌రెడ్డి, అన్వరిబేగం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రావు, తహసీల్దార్ ఖయ్యూం, నాయకులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలని ఎమ్మెల్యేకు వినతి

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఆరు హామీలను అమలు చేయాలని రాయికల్ 4వ వార్డు కౌన్సిలర్ తురగ శ్రీధర్‌రెడ్డి ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు.

సేవా దృక్పథంతోనే ఆపరేషన్లు

జగిత్యాల: సేవా దృక్పథంతోనే ఆపరేషన్లు చేస్తున్నట్లు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం నియోజకవర్గానికి చెందిన 12 మంది నిరుపేదలకు ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ విజయ్, బాలముకుందం , పవన్, మహేశ్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం


జైనాలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ చిలుముల లావణ్య

ధర్మపురి: మండలంలోని జైనా, మగ్గిడి ఆరెపెల్లి గ్రామాల్లో శనివారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. జైనా సహకార సంఘం చైర్మన్ సొల్ల నరేశ్ ఆధ్వర్యంలో ధర్మపురి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ చిలుముల లావణ్య లక్ష్మణ్ చేతుల మీదుగా కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ సంగ నర్సింహులు, డైరెక్టర్లు, నాయకులు దినేశ్, కుంట సుధాకర్ తదితరులున్నారు.

ధాన్యంలో తాలు, తప్పా లేకుండా చూసుకోవాలి

సారంగాపూర్: ధాన్యంలో రైతులు తాలు,తప్పా, మట్టిపెల్లలు లేకుండా చూసుకోవాలని బీర్‌పూర్ తహసీల్దార్ ముంతాజొద్దీన్ అన్నారు. బీర్‌పూర్ మండలం తాళ్ల ధర్మారం, కమ్మునూర్ గ్రామాల్లో శనివారం ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పరిశీలించి, తేమ శాతాన్ని పరీక్షించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట డెప్యూటి తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్‌ఐ శ్రీనివాస్, ఏఈవో వినోద్, రైతులు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే ట్యాబ్‌లో నమోదు చేయాలి

ఇబ్రహీంపట్నం: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే రైస్‌మిల్‌లకు ధాన్యం తరలించి, ట్యాబ్‌లో నమోదు చేయాలని తహసీల్దార్ ప్రసాద్ కొనుగోలు కేంద్రాలలో సిబ్బందికి సూచించారు. శనివారం మండలంలోని కేశాపూర్, మూలరాంపూర్ గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకుని తాలు, తప్పా లేకుండ కొనుగోలు కేంద్రాలకు తీసుకవచ్చి సహకరించాలని కోరారు. రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు రేవంత్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

వెల్గటూర్: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గుండాటి గోపిక అన్నారు. మండలంలోని పాతగూడూర్, గొడిశెలపేట, పైడిపెల్లి, పడకల్, అంబారిపేట, శాఖాపూర్ రాంనూర్, సంకెనపెల్లి, కోటిలింగాల గ్రామాల్లో శనివారం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ గోల్ల తిరుపతి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మెన్లు రత్నాకర్, రాంరెడ్డి, ఏపీఎం చంద్రకళ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఎంఈవోలకు ప్రభుత్వ వాహనం కేటాయించాలి

సారంగాపూర్: ఎంఈవోలకు ప్రభుత్వ హహనాలు కేటాయించాలని ఎస్టీయూ(స్టేట్ టీచర్స్ యూనియన్) జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు మచ్చ శంకర్, భైరం హరికిరణ్ అన్నారు. శనివారం బీర్‌పూర్ మండలంలోని పలు పాఠశాలల్లో ఎస్టీయూ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల విద్యాధికారులు అటు పర్యవేక్షణ బాధ్యతలతో పాటు, నోడల్ అధికారిగా, గ్రామ ప్రత్యేకాధికారిగా విధులు నిర్వహిస్తున్నారని ప్రభుత్వం మండల విద్యాధికారులకు ప్రభుత్వ వాహణ సౌకర్యం కల్పించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయపరంగా రావాలసిన పీఆర్‌సీ ప్రకటన ఆలస్యం చేయడం అన్యాయమన్నారు. ఎస్టీటీలకు ఎమ్మెల్సీ ఓటు హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పేరి మంజునాథ్, గుండెల నరేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయాల్లో నీటి కొరత తీర్చిన హనుమాన్ భక్తులు


బోరు రిపేర్ చేయించిన భక్తమండలి సభ్యులు

మల్లాపూర్: మండలంలోని రేగుంటలోని ప్రధాన ఆలయాల్లో నీటికొరతతో ఇబ్బందులు పడుతున్న అర్చకులు, భక్తుల సౌకర్యార్థం శనివారం హనుమాన్ భక్తమండలి కమిటీ సభ్యులు కలిసికట్టుగా ముందుకు వచ్చి నీటి సమస్యను పరిష్కరించారు. ఆలయాల్లో నీటి కొరతతో 5 నెలలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని గుర్తించిన గురుస్వామి గనవేని మల్లేశ్ నేతృత్వంలో హనుహన్ భక్తమండలి కమిటీ సభ్యులు రూ.13 వేలను వెచ్చించి కొత్త మోటార్, స్టాటర్ తెప్పించి ప్రారంభించారు. ప్రధాన ఆలయాల్లో నీటి కొరత తీర్చిన హనుమాన్ భక్తులకు గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హనుమాన్ భక్తమండలి కమిటీ సభ్యులు బొమ్మెన మహేశ్, అన్‌రెడ్డి శేఖర్, దండికే రవీందర్, కుందేళ్ల గౌతమ్ పాల్గొన్నారు.

సూర్యారావు కుటుంబానికి పలువురి పరామర్శ


కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ప్రముఖులు

ధర్మపురి: మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో హైకోర్టు జడ్జి జువ్వాడి శ్రీదేవి తండ్రి సూర్యారావు ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. కుటుంబ సభ్యులను శనివారం పలువురు ప్రముఖులు పరామర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. వారిలో మాజీ మంత్రి మోత్కుపెల్లి నర్సింహులు, సీనియర్ వైద్యుడు రమేశ్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు పడాల శ్రీనివాస్, వీఆర్‌వోల జిల్లా అధ్యక్షుడు దిగంబర్ రావు తదితరులున్నారు.

బోరుబావి పనులు ప్రారంభం

కథలాపూర్: మండలం తక్కళ్లపెల్లిలో పోచమ్మ వాడలో బోరుబావి పనులను మండల కాంగ్రెస్ నాయకులు శనివారం ప్రారంభించారు. పోచమ్మ వాడలో నీటి సమస్య తీవ్రంగా ఉందని స్థానిక నాయకులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు విన్నవించారు. బోరుబావి ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించడంతో పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ మండలాధ్యక్షుడు అల్లకొండ లింగంగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

శ్రీ వేంకటేశ్వర ఆలయంలో 108 ప్రదక్షిణలు


ఆలయంలో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

కోరుట్ల: పట్టణంలోని అతి పురాతన శ్రీ వేంకటేశ్వర ఆలయంలో తిరు నక్షత్రం సందర్భంగా శనివారం భక్తులు ఆలయం చుట్టూ 108 ప్రదక్షిణలు చేశారు. శ్రీ లక్ష్మీ నరసింహ అంధ కళాకారుల సంగీత విభావరి భక్తులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య, ఈవో విక్రమ్, వేంకటేశ్వర భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

ఆలయాల్లో కార్తీక పూజలు


చింతకుంటలో శ్రీ తారకేశ్వరస్వామి దేవాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కథలాపూర్: మండలంలోని పోతారంలో శ్రీ లొంక రామేశ్వరస్వామి, చింతకుంట గ్రామంలో శ్రీ తారకేశ్వరస్వామి ఆలయాల్లో శనివారం భక్తులు కార్తీకమాసం ప్రత్యేక పూజలు పూజలు చేశారు. ఆలయంలోని స్పటిక లింగానికి భక్తులు అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయాల్లో భక్తులు భజనలు చేశారు.

ఘనంగా గోపాష్టమి వేడుకలు


గోమాతకు పూజలు చేస్తున్న భక్తులు

ధర్మపురి: గోపాష్టమి వేడుకలను ధర్మపురి పట్టణంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక గోదావరి తీరం, అక్కపెల్లి రాజరాజేశ్వరస్వామి ఆలయం, గోశాలలో గోవులను అలంకరించి మహిళలు మంగళహారతులనిచ్చి గోమాతకు పూజలు చేశారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతీ ఒక్కరు ఓటు నమోదు చేసుకోవాలి

పెగడపల్లి: వచ్చే ఏడాది జనవరి 1వరకు 18 ఏళ్ల నిండబోయే ప్రతీ ఒక్కరు ఓటరు నమోదు చేసుకోవాలని పెగడపల్లి తహసీల్దార్ రవీందర్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాన్ని సందర్శించి కొత్త ఓటరు నమోదు దరఖాస్తులను ఆయన స్వీకరించారు. అన్ని గ్రామాల్లో ఓటరు నమోదు కోసం ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేస్తామని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆర్‌ఐలు శ్రీనివాస్, జమున, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

ఓటర్ల నమోదును పరిశీలించిన తహసీల్దార్

ఇబ్రహీంపట్నం: మండలంలోని ఆయా గ్రామాల్లో పోలింగ్ బూత్‌ల వద్ద బీఎల్‌వోలు చేపడుతున్న కొత్తగా ఓటర్ల నమోదు, తప్పొప్పుల సవరణలు శనివారం తహసీల్దార్ ప్రసాద్ పరిశీలించారు. జనవరి 1, 2025 నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతి, యువకులు కొత్తగా ఓటర్‌గా నమోదు చేయాలని బీఎల్‌వోలకు సూచించారు. మండలంలో 18 ఏళ్లు నిండిన యువతీయువకులు ఓటర్‌గా నమోదు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు రమేశ్, రేవంత్‌రెడ్డి, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

బీసీ, ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక అధ్యక్షుడిగా బొల్లపల్లి శ్రీనివాస్

మల్లాపూర్: బీసీ, ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక చిట్టాపూర్ అధ్యక్షుడిగా బొల్లపల్లి శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం చిట్టాపూర్‌లో కులసంఘాల పెద్ద మనుషుల సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా బోడ శేఖర్, కార్యదర్శిగా బర్ల మల్లేశ్, దేవాదాయ కమిటీ చైర్మన్‌గా దండుగుల అంజిరాజ్, కోశాధికారిగా ఉప్పులూటి నారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు నారవేని రమేష్, కనుక అభిషేక్, కడకుంట్ల కాశీరాం, పోతుకంటి శ్రీనివాస్‌గౌడ్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

కులం పేరుతో దూషించిన వ్యక్తిపై కేసు నమోదు

పెగడపల్లి: కులం పేరుతో దూషించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పెగడపల్లి ఎస్సై రవికిరణ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన చాట్ల విజయభాస్కర్ అనే వ్యక్తిని ఈ నెల 5న పెగడపల్లి సొసైటీ చైర్మన్ రమణారావు అనే వ్యక్తి కులం పేరుతో దూషించినట్లు విజయభాస్కర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు రమణారావుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

జ్వరంతో బాలిక మృతి

సారంగాపూర్: మండలంలోని రంగపేట గ్రామంలో శనివారం ఎరపాక సాన్విత (9నెలలు) జ్వరంతో మృతిచెందింది. సాన్వితకు మూడు రోజులుగా జ్వరం వస్తుండడంతో జగిత్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. జ్వరం తగ్గడంతో చిన్నారిని తల్లితండ్రులు రమ్య–మల్లేశ్‌లు ఇంటికి తీసుకువచ్చారు. తిరిగి అతిగా జ్వరం రావడంతో తీవ్ర అస్వస్థతకు గురై చిన్నారి మృతి చెందింది. చిన్నారి మృతితో తల్లితండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి

జగిత్యాల: పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని లైవ్‌స్టాక్ ఆఫీసర్ కందుకూరి పూర్ణచందర్ అన్నారు. మండలంలోని బాలపల్లిలో గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి ప్రాణాంతకమైందని, ఈ వైరస్‌తో సూక్ష్మజీవుల వల్ల పశువులకు ప్రబలి అధిక జ్వరం, నోట్లో పొక్కులు పొడవడం, సొంగ కారడం వంటివి ఉంటాయన్నారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ రవి, సబార్డినేట్ అనిత, సెక్రటరీ సుప్రియ పాల్గొన్నారు.

గాయపడిన కార్మికులకు మెరుగైన చికిత్స అందించాలి

కోరుట్ల: కోరుట్లలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మున్సిపల్ కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. జగిత్యాలలో చికిత్స పొందుతున్న కార్మికులను శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారి చికిత్సకు అయ్యే ఖర్చులన్నీ మున్సిపల్ కమిషనర్ భరించాలన్నారు. డ్యూటీలో ప్రమాదం జరిగినందునా బాధితులకు రూ. 50 వేలు ఆర్థికసాయం అందించాలన్నారు. నాయకులు ఎండీ ఉస్మాన్, దేవదాసు, మహేశ్, పాల్గొన్నారు.


వెంగళాయిపేటలో నిలిచిన పంచాయతీ భవనం

పెగడపల్లి: మండలంలోని వెంగళాయిపేట గ్రామ పంచాయతీ భవనం అర్ధాంతరంగా నిలిచిపోయింది. ఇక్కడ ఎళ్ల క్రితం నిర్మించిన జీపీ భవనం శిథిలావస్థకు చేరి పనుల నిర్వహణ ఇబ్బందిగా మారింది. గత ప్రభుత్వ హయాంలో ఈజీఎస్ నుంచి రూ. 20 లక్షలు మంజూరు కాగా, కాంట్రాక్టర్ చేసిన పనులకు బిల్లులు రాక పోవడంతో ఆపేశాడు. ఇప్పటికైన సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి జీపీ భవన నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 9705346639, 9440061630, 9705346643